సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 7 | మే | 2025



హనుమాన్ దీక్ష.. సర్వ జగద్రక్ష
కాజీపేట పట్టణంలో దక్షిణ ముఖంగా వెలిసిన అభయాంజనేయ స్వామి ప్రముఖ క్షేత్రం హనుమాన్ దీక్షలకు ప్రసిద్ధిగాంచింది.
- 8లో▸



ఏసీబీ వలలో జెడ్పీ అధికారులు
ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ రూ.25వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
37^0 / 26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మాతృ మరణాలు నివారించాలి : డీఎంహెచ్‌ఓ



ఎంజీఎం: జిల్లాలో మాతృ మరణాలను నివారించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. 2024–2025లో సోమిడి, శాయంపేట మండలం గట్లకనపర్తిలో రెండు మాతృ మరణాలు జరిగాయి. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అలాగే గుర్తించిన లోపాలను ఎలా సరిదిద్దాలో వివరించారు. సమావేశంలో గైనకాలజిస్టులు జీఎంహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, సీకేఎం డాక్టర్ స్వప్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, ఫిజీషియన్లు డాక్టర్ ఆశాలత, డాక్టర్ నిఖిల, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ అనిత, ఎస్‌ఓ ప్రసన్నకుమార్, డెమో అశోక్ రెడ్డి, విజయలక్ష్మి, సురేఖ, సుప్రియ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కామర్స్ డీన్‌గా ప్రొఫెసర్ రాజేందర్

కేయూ క్యాంపస్: కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల డీన్‌గా పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం వీసీ ప్రతాప్‌రెడ్డి..రాజేందర్‌కు ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటివరకు డీన్‌గా ప్రొఫెసర్ అమరవేణి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీకాలం ముగియడంతో రాజేందర్‌ను నియమించారు. కేయూలో 2005లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన నియమితులయ్యారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా, ఖమ్మం పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఈనెల 7న డీన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రాజేందర్‌రెడ్డి.. రెండు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.

కే హబ్ డైరెక్టర్‌గా సవితాజ్యోత్స్న



కాకతీయ యూనివర్సిటీలోని కే హబ్ డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్నను నియమిస్తూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. రూసా నోడల్ ఆఫీసర్ సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలని ఆ ఉత్తర్వుల్లో రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

ఇన్నోవేషన్‌హబ్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా సిద్ధార్థ



కే హబ్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంప్లాయ్‌బిలిటీ అండ్ ఇన్నోవేషన్ హబ్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా కేయూ ఇంజనీరింగ్ కాలేజీ (కోఎడ్యుకేషన్) కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.సిద్ధార్థ నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులను సిద్ధార్థకు అందజేశారు.

హోదాకు తగని సీఎం వ్యాఖ్యలు : టీపీటీఎఫ్

విద్యారణ్యపురి: ఉద్యోగులనుద్దేశించి సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు తన హోదాకు తగవని అవగాహనా రాహిత్యంతో అర్థరహితంగా ఉన్నాయని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరడం సహజమని, పరిష్కరించాలి లేదంటే సానుకూలంగా స్పందించి చర్చించాలి కానీ, అసహనంతో మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర గడిచినా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని వాపోయారు.

మలిన జల శుద్ధి కేంద్రాలకు నిధులు

వరంగల్ అర్బన్: మలిన జల శుద్ధి కేంద్రాల అభివృద్ధికి ప్రోత్సాహక నిధులు అందజేయనున్నట్లు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ ధిల్లాన్ అన్నారు. అమృత్ 2.0లో ఎంపికైన నగరాల కమిషనర్లు, ఉన్నతాధికారులతో మంగళవారం ఆమె ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధిల్లాన్ మాట్లాడుతూ నగరాల స్థాయి, రేటింగ్ ఆధారంగా నిధులు ఇవ్వనున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రవి కుమార్, సంతోష్‌బాబు, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడిన చెట్లు, స్తంభాలు తెగిపడిన విద్యుత్ తీగలు
- తడిసిన ధాన్యం.. పండ్ల తోటలకు నష్టం
- హనుమకొండ జిల్లాలో సగటున 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



భద్రకాళి ఆలయంలో గాలి దుమారానికి కూలిపోయిన చలువ పందిళ్లు

హన్మకొండ/వరంగల్: హనుమకొండ జిల్లాలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలో సగటున 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో తెగిపోయాయి. స్తంభాలు విరిగిపోయాయి. వరంగల్‌నగరంతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ అధికారులు, సిబ్బంది సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరణ పనులు చేపట్టారు. హసన్‌పర్తిలో నిలిచి ఉన్న ఓ ఆటోపై విద్యుత్‌స్తంభం పడడంతో ఆటో ధ్వంసమైంది. ఈసంఘటనలో ఆటోడ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. శ్రీభద్రకాళి ఆలయంలో భక్తుల కోసం వేసిన చలువ పందిళ్లు కూలిపోయాయి. వర్షానికి కల్లాల్లో ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. కొంతమేర వరదలో కొట్టుకుపోవడంతో రైతులు మొత్తుకుంటున్నారు. ఆరు మండలాల్లో 137 మంది మామిడి తోటల రైతులు 578 ఎకరాల్లో నష్టపోయారు. భీమదేవరపల్లిలో 40.2 మిల్లీమీటర్లు, వేలేరులో 39.9, ఎల్కతుర్తిలో 19.1, కమలాపూర్‌లో 19.1, హసన్‌పర్తిలో 26.3, ధర్మసాగర్‌లో 28.6, కాజీపేటలో 33.9, హనుమకొండలో 18.9, ఐనవోలులో 36.4, పరకాలలో 12.8, దామెరలో 8.4, ఆత్మకూర్‌లో 7, శాయంపేటలో 16.4, నడికుడలో 14.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో విక్రయించుకునేందుకు తెచ్చి ఆరబోసిన మక్కలు అకాల వర్షంతో కొట్టుకుపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. 'మక్కలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రాకపోవడంతో బయట ఆరబోశామని, వర్షం రావడంతో మక్కలు తడిసిపోవడమే కాకుండా కొన్ని కొట్టుకుపోయాయని కొండాపూర్‌కు చెందిన రమణమ్మ తెలిపింది.





పెగడపల్లి స్టేజీ వద్ద కొట్టుకుపోయిన ధాన్యాన్ని దగ్గరికి చేరుస్తున్న రైతు, ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ



తడిసిన మక్కలను ఆరబోస్తున్న మహిళా రైతు



హసన్‌పర్తిలో ఆటో మీద పడిన విద్యుత్ స్తంభం

కేయూలో వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, జువాలజీ విభాగం ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేయూ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జూన్ 13 నుంచి 16 వరకు మాలిక్యూలర్ డాకింగ్ అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో వర్క్‌షాప్ బ్రోచర్‌ను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జువాలజీ విభాగం అధిపతి జి.షమిత మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో ఇన్‌సిలికో డ్రగ్ డిజైన్, మాలిక్యూల్ బిల్డింగ్, ప్రొటీన్ మాడలింగ్, డాకింగ్ సిమ్యులేషన్ అంశాలపై హ్యాండ్స్ ఇన్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే వారు ఈనెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తివివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వివరాలకు ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి (9110741338)ని సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలపై అయోమయం

- కేయూ పరిధిలో ఫీజులు చెల్లించని 138 కళాశాలలు దోస్త్ నుంచి తొలగింపు
- వీటిలో ఎక్కువశాతం ప్రైవేట్ కాలేజీలే
- ఇప్పటికే రెండు సార్లు పరీక్షలు వాయిదా
- ముగిసిన ఫీజు చెల్లింపు గడువు
- ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకే పరీక్షలు
- మిగతా విద్యార్థుల పరిస్థితి ఏమిటీ?



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ తదితర కోర్సులకు సంబంధించి 2, 4,6 సెమిస్టర్లు, బ్యాక్‌లాగ్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలు ఈ నెల 14వ తేదీనుంచి నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ వరకు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు గడువు విధించారు. అయినప్పటికీ ఎక్కువశాతం ప్రైవేట్ కాలేజీలు పరీక్షల విభాగానికి చెల్లించలేదు. దీంతో పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా, అధికారులు మాత్రం ఫీజులు చెల్లించిన కళాశాలల విద్యార్థులకు మాత్రం ఈనెల 14నుంచి పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఇప్పటివరకు 107 కాలేజీలు ఫీజుల చెల్లింపు..

కేయూ పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్, గురుకులాలు కలిపి 292 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. అందులో 217 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలున్నాయి. డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల నిర్వహణకు రెండు సార్లు టైంటేబుల్‌ను ప్రకటించి ఫీజులు చెల్లించాలని కోరారు. ఎక్కువశాతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు తమకు ప్రభుత్వంనుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని, అందువల్ల పరీక్షల నిర్వహణకు సహకరించబోమని బహిష్కరించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు రెండు సార్లు పరీక్షలు వాయిదా వేశారు. అయినా చాలా కాలేజీలు ముందుకు రాకపోవటంతో ఈనెల 4న కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఏయే ప్రైవేట్ కాలేజీలు ఇప్పటివరకు పరీక్షల ఫీజులు చెల్లించలేదో గుర్తించారు.

సెమిస్టర్ల పరీక్షలు జరిగేనా ?

తప్పనిసరిగా పరీక్షలు నిర్వహిస్తామని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నప్పటికీ పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువశాతం ప్రైవేట్ కాలేజీలు ఫీజులు చెల్లించలేదు. దీంతో వారు పరీక్షలు నిర్వహిస్తారా లేదా అనేది సందిగ్ధం నెలకొంది. ప్రధానంగా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఆరవ సెమిస్టర్ కీలకమైంది. ఈ పరీక్షలు జరగకుంటే వారు ఉన్నత చదువులు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం వారు టీజీ ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీసెట్‌కు ప్రిపేరవుతున్నారు. ఆ పరీక్షలు కూడా సమీపిస్తున్నాయి. ఎలాగైనా పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్ విద్యార్థులనుంచి వినిపిస్తోంది. డిగ్రీ వివిధ సెమిస్టర్ల పరీక్షలకు సుమారు 1.70 లక్షల మందికిపైగా విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజులు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంపై కూడా విమర్శలొస్తున్నాయి. ఫీజులు చెల్లించిన కాలేజీలకే పరీక్షలు నిర్వహిస్తే, చెల్లించని కాలేజీల విద్యార్థుల పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది.

ఇటీవల దోస్త్ నోటిఫికేషన్..

2025–2026 విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్‌కు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. కేయూ అధికారులు పరీక్షల ఫీజులు చెల్లించని 138 ప్రైవేట్ డిగ్రీ కాలేజీల పేర్లను దోస్త్ నుంచి తొలగించారు. దీంతో ఆయా కాలేజీల్లో అడ్మిషన్లకు ఆప్షన్లు ఎంచుకునే అవకాశం లేదు. దీంతోనైనా పరీక్ష ఫీజులు చెల్లించేందుకు యాజమాన్యాలు ముందుకువస్తాయని భావించారు. మంగళవారం పరీక్ష ఫీజు గడువు ముగిసే వరకు 138 కాలేజీల్లో 4 కాలేజీలు మాత్రమే చెల్లించాయి. మొత్తంగా అన్ని యాజమాన్యాలు కలిపి మంగళవారం వరకు 107 కాలేజీలు ఫీజులు చెల్లించాయి.

ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకే పరీక్షలు



కేయూ పరిధిలో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని ఎక్కువశాతం ప్రైవేట్ కాలేజీలు ఫీజులు చెల్లించడం లేదు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా వేశాం. వారికి సమయం కూడా ఇచ్చాం. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు ఫీజులు చెల్లించిన అన్ని యాజమాన్యాల కాలేజీల్లో ఈ నెల14నుంచి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహిస్తాం. రెండు, మూడు రోజుల్లో హాల్‌టికెట్లు జారీ చేస్తాం. ఇప్పటికైనా ఫీజులు చెల్లించని కాలేజీలు ఒకటి, రెండు రోజుల్లోనైనా ఫీజులు చెల్లించి నామినల్‌రోల్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

– కె.రాజేందర్, పరీక్షల నియంత్రణాధికారి

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్ రఘునాథకాలనీలో తనిఖీలు చేస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో ముందస్తుగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్‌లో మేయర్ మంగళవారం పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రఘునాథకాలనీలో విరిగిన మూడు విద్యుత్ స్తంభాలు, చెట్టును పరిశీలించారు. వాటిని తొలగించాలని డీఆర్‌ఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి మేయర్ మాట్లాడారు. నాలాల్లో పూడికతీసేందుకు టెండర్లు పిలవాలని సూచించారు. రోడ్లు, డ్రెయిన్లలో ప్రజలు చెత్త వేయకుండా చూడాలని, అనుమతి లేకుండా పోతనరోడ్డులోని స్క్రాప్ దుకాణాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీచేసి జరిమానా విధించాలని, వేంకటేశ్వరస్వామి ఆలయ పక్క వీధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఎన్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బందికి డివిజన్‌లో అనువుగా ఉన్న ఏదైనా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి అన్నపూర్ణ భోజనం ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించేలా చూడాలని సీఎంహెచ్‌ఓ రాజారెడ్డిని మేయర్ ఆదేశించారు. ఆమె వెంట శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, ఎన్పీడీసీఎల్ ఏఈ రవీందర్, లైన్‌మెన్ సాంబయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కంటేష్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ డీపీఆర్ సిద్ధం చేయండి

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ)పై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జోన్ల వారీగా సమగ్ర అధ్యయనం చేసి యూజీడీ డీపీఆర్ తయారుచేయాలని సూచించారు. సమీక్షలో గ్రేటర్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మాధవీలత పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్



మామునూరు పీఎస్‌ను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్/మామునూరు: మత్తు పదార్థాలను నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మామునూరు, ఏనుమాముల, గీసుకొండ పోలీస్‌స్టేషన్లను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ తిరుపతితో కలిసి సీపీ మంగళవారం సందర్శించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిసరాలు, హాజరు రిజిస్టర్లు, పలు కేసుల ఫైళ్లను సీపీ పరిశీలించారు. స్టేషన్ల పరిధిలో సెక్టార్ల వారీగా ఎస్సైలు నిర్వర్తిస్తున్న విధులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరును ఇన్‌స్పెక్టర్లు రమేశ్, రాఘవేందర్, మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు తప్పనిసరిగా రౌడీషీటర్లపై నిఘా పెట్టి వారి స్థితిగతులపై ఆరా తీయాలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి కేసు నమోదు చేయడమేకాకుండా నిందితులను అరెస్టు చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పెట్రోలింగ్ నిర్వహించాలని సీపీ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, రాజు, సిబ్బంది ఉన్నారు.

ఇన్‌చార్జ్ పాలనే..

- డీసీపీఓకు పూర్తిస్థాయి అధికారి కరువు
- కొరవడుతున్న బాలల సంరక్షణ చర్యలు
- అదనపు బాధ్యతలతో సిబ్బందికి తప్పని తిప్పలు

కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ పరిధి జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి (డీసీపీఓ) ఏడాదిగా జిల్లా అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జ్ పాలనే కొనసాగుతోంది. గతేడాది మార్చిలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి వ్యక్తిగత కారణాలతో విధులనుంచి వెళ్లిపోయారు. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ప్రొటెక్షన్ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన సొంతశాఖతోపాటు డీసీపీఓ బాధ్యతలు నిర్వస్తుండడంతో పనిభారం ఎక్కువైంది. దీంతో బాలల సంరక్షణ చర్యలు కుంటుపడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బాలల పరిరక్షణ అధికారి విధులు ఇవే..

జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్త్రీ,శిశు సంక్షేమ సారథ్యంలో ఏర్పాటు చేసిన బాల రక్ష భవన్‌లోని సీడబ్ల్యూసీ, జువైనల్ జస్టిస్ బోర్డ్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, నేషనల్ చైల్డ్ లేబర్ చైల్డ్ ప్రాజెక్ట్ వంటి ఏడు విభాగాల పర్యవేక్షణతోపాటు బాలల పరిరక్షణ లక్ష్యంగా విధులు నిర్వహించాలి. బాల రక్షభవన్‌లోని కిందిస్థాయి సిబ్బందిని సమన్వయ పరుస్తూ బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి. ఏడాదిగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి లేకపోవడంతో పాలనలో పూర్తిస్థాయి నిర్ణయాలను తీసుకునే అవకాశం లేకుండాపోయింది. అన్ని విధాల అర్హులైన సిబ్బంది ఉన్నా నియమించకపోవడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

డైరెక్టర్‌కు నివేదిక అందజేశాం

డీసీపీఓ ఖాళీ భర్తీకి స్త్రీ,శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌కు నివేదిక అందజేశాం. డీసీపీఓతోపాటు శిశుగృహ మేనేజర్ పోస్ట్ భర్తీ చేయాలని కోరాం. త్వరలో ఉత్తర్వులు రాగానే నియమిస్తాం.

– జయంతి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, కిచెన్‌షెడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ వాసంతి, సీపీఓ సత్యనారాయణరెడ్డి, సీడీపీఓలు, అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి రథసేవ





అమ్మవారి సన్నిధిలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు, వేదపండితులు మంగళవారం ఉదయం నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి హోమం, బలిఉత్సవం జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని భద్రకాళి మహాత్రిపుర సుందరిగా అలంకరించి రథసేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు హనుమకొండ నాయీబ్రాహ్మణ సంఘం బాధ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అతిథులుగా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బండారు జగదీశ్‌బాబు, గౌరవ సలహాదారులు తూముల సాంబయ్య, జీవనాథ్, కమిటీ సభ్యులు వాసు, శ్రీరాముల రమేశ్, నరేందర్, జగన్, సురేశ్, శివ, సతీశ్, మధుసూదన్ పాల్గొన్నారు. ఈఓ శేషభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జూన్ 13 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

నయీంనగర్: వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో జూన్ 13, 14, 15 తేదీల్లో 16వ జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ఆర్.మూర్తి తెలిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ నుంచి మూడు, ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు నాటికలు ప్రదర్శనకు ఎంపికయ్యాయని వివరించారు. ప్రదర్శించిన ప్రతి నాటికకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ. నాలుగు వేలు అందజేయనున్నట్లు తెలిపారు. శతపతి శ్యామలరావు, వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, శర్మ, సుధాకర్ పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై పోలీసుల దాడులు

సాక్షి ఎఫెక్ట్


వరంగల్ క్రైం: నగరంలోని వైన్‌షాపుల ఎదుట బహిరంగ మద్యపానంపై పోలీసులు మంగళవారం కొరఢా ఝులిపించారు. పలువురిపై కేసులు నమోదు చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వైన్‌షాపు పర్మిట్‌రూమ్‌లో కాకుండా పక్కన వీధులు, సమీప షాపులు, గృహాల ఎదుట మందుబాబులు సిట్టింగ్ వేస్తున్నారు. దీంతో అక్కడి నుంచి వెళ్లే మహిళలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వైనంపై ఈ నెల 4వ తేదీన 'రోడ్లు, దుకాణాలే సిట్టింగ్ సెంటర్లు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన సుబేదారి పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. సుబేదారి పరిధిలోని అన్ని వైన్‌షాపుల వద్ద బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేశారు. పర్మిట్‌రూంలలోనే మందుబాబులు మద్యం సేవించేలా చూడాలని వైన్‌షాపు నిర్వాహకులను హెచ్చరించారు.



హనుమకొండ సుబేదారి పరిధిలోని ఓ వైన్‌షాపు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

సరస్వతి విగ్రహ పీఠం సిద్ధం



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతినది పుష్కరాలకు సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి మాత విగ్రహ ఏర్పాటుకు మంగళవారం పీఠం సిద్ధం చేశారు. భారీ క్రేన్‌తో రాతిపీఠాన్ని కాంక్రీటు స్టాండ్‌పై పెట్టారు. బుధవారం దశమి సందర్భంగా 10 ఫీట్ల సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని క్రేన్ సాయంతో పీఠంపైన అమర్చనున్నారు. ఈ విగ్రహాన్ని తమిళనాడులోని మహాబలిపురంలో రూ.50లక్షల వ్యయంతో నాలుగు వేదమూర్తుల విగ్రహాలను తయారు చేయించారు.

సరస్వతినది పుష్కరాల ప్రారంభానికి సీఎం

కాళేశ్వరంలో మే 15న సరస్వతినది పుష్కరాల ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు ఆలయవర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు ఆయనకు హైదరాబాద్‌లో మంగళవారం ఆహ్వానపత్రిక అందించారు. ఈనెల15న పుష్కరాల కార్యక్రమాన్ని మెదక్ రంగంపేటకు చెందిన స్వామిజీ మాధవనందసరస్వతి చేతులమీదుగా ప్రారంభిస్తారు.

కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో సింగరేణికి హాల్టింగ్ పునరుద్ధరణ

కాజీపేట రూరల్ : భద్రాచలం రోడ్-బల్లార్షా సింగరేణి ప్యాసింజర్‌కు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో యథావిధిగా హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఇంజనీరింగ్ బ్లాక్ వల్ల గతంలో సింగరేణి ప్యాసింజర్‌కు కాజీపేట టౌన్ స్టేషన్‌లో హాల్టింగ్‌ను ఎత్తివేశారు. రైల్వే బ్లాక్ పనుల అనంతరం సికింద్రాబాద్ రైల్వే అధికారులు సింగరేణి ప్యాసింజర్‌కు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో యథావిధిగా హాల్టింగ్‌తో మంగళవారం నుంచి నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో భద్రాచలంరోడ్-బల్లార్షా (17033) వెళ్లే సింగరేణి ప్యాసింజర్ కాజీపేట టౌన్‌కు ప్రతి రోజు ఉదయం 09:08 గంటలకు చేరుతుందని, తిరుగు ప్రయాణంలో సిర్‌పూర్ టౌన్-భద్రాచలంరోడ్ (17034) వెళ్లే సింగరేణి ప్యాసింజర్‌గా కాజీపేట టౌన్‌కు ప్రతి రోజు మధ్యాహ్నం 3:25 గంటలకు చేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

యథావిధిగా ప్యాసింజర్ రైళ్లు

కాజీపేట జంక్షన్ మీదుగా విజయవాడ, సికింద్రాబాద్, బల్లార్షా రూట్‌లో అప్ అండ్ డౌన్ ప్రయాణించే 10 ప్యాసింజర్ రైళ్లను మంగళవారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కేయూకు కంప్యూటర్ల వితరణ

కేయూ క్యాంపస్ : ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సామాజిక బాధ్యతగా కాకతీయ యూనివర్సిటీకి మరో 60 కంప్యూటర్లను సోమవారం రాత్రి వితరణ చేసింది. వీటిని మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కంప్యూటర్ విభాగం అధ్యాపకుడు, కేయూ నెట్‌వర్క్ డైరెక్టర్ డి.రమేశ్ స్వీకరించారు. కంప్యూటర్లు అందజేయడంతో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, వి.రామచంద్రం స్వాగతిస్తూ ఆ సంస్థను అభినందంచారు. 15 కంప్యూటర్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీకి, 5 బయోటెక్నాలజీకి, 5 కెమిస్ట్రీకి, 10 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి, కేయూ ఇంజనీరింగ్ కాలేజీ (కోఎడ్యుకేషన్‌కు)కి 5, జువాలజీ-5, జర్నలిజం విభాగానికి రెండు, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయానికి-4, హాస్టల్ ఆఫీస్‌కు మూడు కంప్యూటర్లను అందజేశారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.



హనుమాన్ దీక్ష.. సర్వ జగద్రక్ష

ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం

- భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షలు
- ఈ నెల 22న హనుమాన్ జయంతి

కాజీపేట : అత్యంత భక్తిశ్రద్ధలు, కఠోర నియమాలతో చేపట్టే దీక్షల్లో హనుమాన్ దీక్ష ఒకటి. పురాణ కాలాల్లోనూ పలువురు ఈ దీక్షను ఆచరించినట్లుగా ఇతిహాసాలు చెబుతున్నాయి. ట్రైసిటీలో ఒకటిగా పేరొందిన కాజీపేట పట్టణంలో దక్షిణ ముఖంగా వెలిసిన అభయాంజనేయ స్వామి ప్రముఖ క్షేత్రం హనుమాన్ దీక్షలకు ప్రసిద్ధి గాంచింది. సుమారు 40 ఏళ్లుగా భక్తులు ఇక్కడ దీక్షలు తీసుకున్న స్వాములు కొండగట్టు ఆంజనేయుడు, భద్రాచల రామచంద్ర స్వామి దర్శనం కోసం తరలి వెళ్తుంటారు. 41 రోజుల పాటు మండల దీక్షలు, 21 రోజుల అర్ధ మండల దీక్షలు, 16 రోజులు, 11 రోజుల దీక్షలను ఈ ఆలయంలో స్వీకరిస్తారు.

శ్రీరాముడు స్వీకరించిన దీక్ష ఇదే..

హనుమద్ దీక్ష గొప్పతనాన్ని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రధానార్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ వివరించారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తి సీత అన్వేషణలో భాగంగా మూడ్రోజులపాటు ఆంజనేయస్వామి దీక్ష చేపట్టినట్లు పురాణాలు చెబుతున్నాయని వివరించారు. ఏటా వైశాఖ మాస కృష్ణపక్ష దశమి పూర్వాభద్ర నక్షత్రం రోజున హనుమాన్ జయంతి నిర్వహిస్తుంటారు. దీన్ని పురస్కరించుకుని భక్తులు హనుమాన్ దీక్షలు చేపడుతున్నారు. ఈ ఏడాది లక్ష తమలపాకుల పూజతో హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీక్షలు పూర్తయిన రోజున కపిబంధనోత్సవం నిర్వహిస్తారు. మహా పూర్ణాహుతి (శాంతిహోమం)తో దీక్షలు ముగుస్తాయి.



కాజీపేటలో కొలువుదీరిన ఆంజనేయస్వామి



హనుమాన్ మాల ధరిస్తున్న భక్తులు

రెండు రకాల దీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా పలువురు భక్తులు హనుమాన్ దీక్షలు చేపడుతున్నారు. హనుమాన్ విజయోత్సవ వేడుకలను పురస్కరించుకుని దీక్షలు తీసుకోవడం ప్రారంభమైంది. 41 రోజుల దీక్షలు, 21 రోజుల అర్ధ మండల దీక్షలను చేపట్టిన భక్తులు కఠిన నియమాలను పాటిస్తున్నారు. వేకువజామున నిద్రలేవడం, తల స్నానం చేయడం, భజనలు, పేట తుళ్లి నృత్యాల ద్వారా శారీరక ఆరోగ్యం చేకూరుతుందని దీక్షదారులు చెబుతున్నారు. ఈ నెల 14న కొండగట్టు ఆలయంలో జరిగే మహా పూర్ణాహుతిలో దీక్షదారులు ఇరుముడులు సమర్పించడంతో దీక్షలు పరిసమాప్తమవుతాయి.

భక్తితో పాటు ఆరోగ్యం..



హనుమాన్ దీక్షలో భక్తితో పాటు ఆరోగ్యం కూడా దాగి ఉంది. ఇప్పటివరకు 18 ఏళ్లుగా నేను హనుమాన్ మాల వేసుకుంటున్నాను. కఠిన నిబంధనలను పాటిస్తూ దీక్ష చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

- ఏనుట్ల సదన్‌రావు, గురుస్వామి, ధర్మసాగర్

దీక్షతో దివ్యానుభూతి



ఏటా క్రమం తప్పకుండా హనుమాన్ దీక్ష స్వీకరిస్తుంటాను. ఈ దీక్ష నాలో దివ్యానుభూతిని కలిగిస్తోంది. దీక్ష వల్ల ఆధ్యాత్మిక భావాలు కలగడంతో పాటు మంచి నడవడిక, ఆరోగ్యం చేకూరుతాయి. మనసుకు ఎంతో ప్రశాంతత కలుగుతుంది.

- మోడెం సురేందర్‌గౌడ్, గురుస్వామి, కాజీపేట

ప్రసిద్ధి ఈ దేవాలయం..



కాజీపేట అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిత్యం విశేష పూజలు జరుగుతుంటాయి. హనుమాన్ విజయోత్సవ వేడుకలతో పాటు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు దర్శనం కోసం వచ్చిపోతుంటారు.

- జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, అర్చకులు, కాజీపేట

రగిలిన ప్రతీకారం..

- తండ్రి హత్య కేసులో నిందితురాలిపై గొడ్డలితో యువకుడి దాడి
- కాటారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఘటన



చికిత్స పొందుతున్న లక్ష్మి



లక్ష్మి

కాటారం : భూ వివాదంలో అయిన వారే తన తండ్రిని కిరాతకంగా హతమార్చడంతో ఓ యువకుడు ప్రతీకారం పెంచుకున్నాడు. ఎలాగైనా వారిని అంతమొందించాలని నిర్ణయించుకొని సమయం కోసం వేచి చూశాడు. నిందితుల్లో ఇద్దరు మహిళ, ఆమె కుమారుడు రోడ్డుపై కనబడటంతో ఒక్కసారిగా గొడ్డలితో వారిపై దాడికి పాల్పడిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన మారుపాక సారయ్యను ఐదు గుంటల భూ వివాదంలో అతడి తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడి భార్య మారుపాక లక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్, మరో ఇద్దరు గతేడాది డిసెంబర్ 14న కంట్లో కారం చల్లి గొడ్డలితో నరికి చంపారు. ఈ కేసులో మారుపాక సమ్మయ్య, లక్ష్మి, మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఇటీవల లక్ష్మి, కిరణ్ కండీషన్ బెయిల్‌పై విడుదల కాగా ప్రతి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాల్సి ఉంది. అందులో భాగంగా లక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా అవకాశం కోసం వేచి ఉన్న మృతుడు సారయ్య చిన్న కుమారుడు మారుపాక అంజి ఒక్కసారిగా లక్ష్మిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. పక్కనే ఉన్న కిరణ్ ప్రాణభయంతో పారిపోయాడు. గమనించిన స్థానికులు అంజిని అడ్డుకోగా అప్పటికే లక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడు అంజిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లక్ష్మి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై గీతారాథోడ్ పేర్కొన్నారు.

తునికాకు కూలీపై అడవి దున్న దాడి

గంగారం : తునికాకు సేకరించేందుకు వెళ్లిన మహిళా కూలీపై అడవిదున్న దాడిచేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని మామిడిగూడెం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గంగారం మండలంలోని మామిడిగూడెం గ్రామానికి చెందిన జనగం సృజన తునికాకు సేకరణలో భాగంగా అడవికి వెళ్లింది. ఈక్రమంలో అడవిదున్న ఒక్కసారిగా ఆమెపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

- భవాని స్వీట్స్ తయారీ కంపెనీకి నోటీసులు
- రూ.3.90 లక్షల విలువైన గడువుతీరిన ముడి దినుసులు సీజ్



తయారీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని భవాని స్వీట్స్, కారా తయారీ కేంద్రంలో (బెల్ బ్రాండ్) రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్వీట్లు తయారు చేసే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, హెయిర్ క్యాప్స్, హ్యాండ్ గ్లవ్స్ వాడకపోవడం, తుప్పు పట్టిన యంత్రాలను ఉపయోగించడం, గోడలు, పైకప్పు బూజుతో ఉండటం, కాలం చెల్లిన బిస్కెట్లు, శనగపప్పును గుర్తించిన బృందం అధికారి వి.జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ కేంద్రానికి నోటీసులు జారీ చేసి శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నామని, కల్తీ అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సుమారు రూ.3.90 లక్షల విలువైన గడువు తీరిన, లేబుళ్లు లేని పదార్థాలను సీజ్ చేసినట్లు ఆమె వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రీషి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ సీజ్



కూల్‌డ్రింక్స్‌ను చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

ఖిలా వరంగల్: కల్తీ, కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ సూచనలతో మంగళవారం సాయంత్రం వరంగల్ శివనగర్‌లోని కేఎస్ కూల్‌డ్రింక్స్ డిస్ట్రిబ్యూషన్ షాపుపై దాడులు చేసినట్లు పేర్కొన్నారు. కల్తీ, కాలం చెల్లిన రూ.33,568 విలువైన కూల్‌డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు ఎండీ ఖలీల్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తికి అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డె దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ వలలో జిల్లా పరిషత్ అధికారులు

- రూ. 25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్



నగదుతో పట్టుబడిన జెడ్పీ సూపరింటెండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్య

ములుగు: ములుగు జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయంలో రూ. 25వేలు లంచం తీసుకుంటున్న సూపరింటెండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్యలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు వివరాలను ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మీడియాకు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు 2023, జనవరి నుంచి అక్టోబర్ వరకు, 2024 జనవరి నుంచి జూన్ వరకు అనారోగ్య కారణాలతో సెలవు తీసుకున్నారు. తిరిగి విధుల్లోకి హాజరైనా పెండింగ్ వేతనం రాలేదు. సుమారు రూ. 3.50లక్షల వేతనం నిలిచిపోయింది. మంజూరుకు మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. ఉన్నతాధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోయింది. చివరికి సూపరింటెండెంట్ సుధాకర్‌ను కలిశాడు. రూ.60 వేలు ఇస్తే పెండింగ్ వేతనం వచ్చేలా చూస్తామని చెప్పడంతో ముందుగా రూ. 25 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. కానీ డబ్బులు సర్దుబాటు కాకపోవడంతోపాటు అధికారుల తీరుతో విసిగివేసారి ఎనిమిది రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు మంగళవారం ముందుగా జూనియర్ అసిస్టెంట్ సౌమ్యను కలిసి రూ.5 వేలు ఇవ్వబోయాడు. నా డబ్బులు రూ. 5వేలతోపాటు సూపరింటెండెంట్‌కు ఇవ్వాల్సిన రూ. 20వేలను ఆయనకే ఇవ్వాలని సౌమ్య చెప్పడంతో సూపరింటెండెంట్ సుధాకర్‌ను కలిసి రూ. 25 వేలు ఇస్తున్న క్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలోని టీం సభ్యులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. వీరిని రేపు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ అభినందనలు



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ : బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు కేటీఆర్‌ను కలిశారు. సభ విజయవంతానికి నాయకులు శ్రమించారని కేటీఆర్ వారిని అభినందించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాటంలో ముందుండాలి

- కంబాలపల్లిలో జవాన్ల తల్లిదండ్రుల పూజలు



హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న జవాన్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ రూరల్ : విజయమో.. వీర స్వర్గమో.. యుద్ధమంటూ వస్తే వెనకడుగు వేయకుండా శత్రువులతో పోరాడేందుకు ముందుండాలని మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి హనుమాన్ దేవాలయంలో జవాన్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పహల్గాం ఉగ్రదాడిని యావత్ ప్రపంచ దేశాలతో పాటు దేశమంతటా నిరసనలతో ఖండిస్తున్నారు. ఒకవేళ యుద్ధం వస్తే పోరాటంలో తమ పుత్రులు ముందు వరుసలో ఉండాలని జవాన్ల తల్లిదండ్రులు పేర్కొన్నారు. జవాన్లకు ధైర్యం చెబుతూ జరుగబోయే యుద్ధంలో పాల్గొంటున్నందుకు గర్వంగా ఉందని జవాన్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గర్వంతో చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సత్యనారాయణ, మలికంటి సైదమ్మ, వద్దుల జయమ్మ, పబ్బోజు రమాదేవి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిన పరపతి సంఘం

- ఇంటికి తాళం వేసి నిర్వాహకుడి పరార్
- సంఘం సభ్యుల ఆందోళన



కాశికుంటలో సంఘ నిర్వాహకుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ఖిలా వరంగల్ : నిరుపేదలు కష్టపడి కరుణ పరపతి సంఘంలో నెలవారిగా పొదుపు చేసుకున్నారు. కానీ సంఘం నిర్వాహకుడు రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి బోర్డు తిప్పేసి కుటుంబ సమేతంగా పరారయ్యాడు. వరంగల్ 41వ డివిజన్ కాశికుంటలో ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. విషయం తెలియడంతో బాధితులు నిర్వాహకుడు వెంకటయ్య ఇంటికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఇంటికి తాళం వేసి ఉండటం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయామని గ్రహించి ఆందోళన చేపట్టారు. మిల్స్‌కాలనీ పోలీసుల ఘటన స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధితుడు పుట్ట మనోహర్ మాట్లాడుతూ.. కాశికుంటలో వెంకటయ్య ఆరేళ్ల క్రితం కరుణ పరపతి సంఘం ఏర్పాటు చేయగా 600 మంది సభ్యులుగా చేరారు. నెలకు వాటాధనం చెల్లిస్తూ వస్తున్నారు. కొంత కాలంగా వెంకటయ్య సభ్యులకు లోన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడు. చివరికి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పరారయ్యాడని తెలిపారు. వెంకటయ్యపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



ఇసుక కోసం గోదావరి నదిలోకి వచ్చిన లారీలు

మంగపేట: మండలంలో అక్రమ ఇసుకదందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మంగపేట- వాడగూడెం సమీపంలోని గోదావరి నదిలో సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని ఇసుక దందాను పలువురు కొనసాగిస్తున్నారు. వందలాది లారీల్లో నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తూ కోట్ల రూపాయలను జేబులో నింపుకుంటున్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ, మైనింగ్, టీజీఎండీసీ అధికారుల అండతో పంట పొలాల్లోని ఇసుక మేటల తొలగింపు పేరుతో ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అనుమతులు పొందారు. మంగపేట మార్కెట్ యార్డు, వాడగూడెం సమీపంలో 50నుంచి 60 మీటర్ల లోతులో ఉన్న గోదావరి నదిలో భారీ పొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలు జరుపుతూ వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఏజెన్సీలోని విలువైన సహజ సంపదను స్థానిక గిరిజనేతరుల సహకారంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన గిరిజనేతరులు దోచుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని గిరిజన సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలోకి రోడ్లు వేసి లారీల్లో ఇసుక తరలిస్తున్న వారిని ప్రశ్నిస్తే ప్రభుత్వమే తమకు కొండంత అండగా ఉంది.. అధికార యంత్రాగం సహకరిస్తుంది.. మీరు ఏం చేస్తారో చేసుకోండని చెప్పడం గమనార్హం. గోదావరి సాక్షిగా అక్రమ ఇసుక దందా కళ్లెదుటే సాగుతున్నా ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్, మైనింగ్, టీజీఎండీసీ అధికారులు తమకేమీ సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తున్నారు.

ఆ సార్ ఫోన్ ఎత్తరు

మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ ఇసుక దందాపై స్థానిక తహసీల్దార్‌ను వివరణ అడిగితే ఇసుక తవ్వకాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని టీజీఎండీసీ పీఓ, మైనింగ్ అధికారులను అడగండి అంటు దాట వేస్తున్నారు. ఏటూరు నాగారం టీజీఎండీసీ పీఓ తోట శ్రీధర్‌ను సంప్రదించేందుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయడం లేదు.

లోడింగ్ చార్జీ పేరుతో వసూళ్లు

ఇసుక దందాను కొనసాగిస్తున్న ఇసుక మాఫియా గురించి అడిగే వారు లేకపోవడంతో క్వారీలకు వచ్చే లారీ యజమానులు, డ్రైవర్ల నుంచి లోడింగ్ చార్జీ పేరుతో ఒక్కో లారీకి రూ. 1,600 వసూలు చేస్తున్నట్లు యజమానులు, డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. క్వారీల్లో అక్రమ ఇసుక దందాను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని ఎత్తేశారా లేక నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సొంతూరిని వీడలేక..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి



రవి (ఫైల్)

దుగ్గొండి : సొంత గ్రామాన్ని వీడలేక.. భార్య, బిడ్డల వద్దకు వెళ్లలేక మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేసి మూడ్రోజులుగా చికిత్స పొందుతూ ఎంజీఎంలో మంగళవారం మృతి చెందాడు. దుగ్గొండి మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన సర్వు రవి (40), రజిత దంపతులకు అమృత, ఐశ్వర్య పిల్లలు ఉన్నారు. వీరిని చదివించేందుకు వరంగల్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుని బతుకుదామని రజిత భర్తను కోరింది. అయితే రవికి ఎంత చెప్పినా వినక పోవడంతో చివరికి రజిత భర్తను వదిలి పిల్లలను తీసుకుని వెళ్లి వరంగల్‌లో ఉంటుంది. ఇదే విషయంపై ఊరి పెద్దలు రవికి సర్దిచెప్పినా వరంగల్‌కు వెళ్లక గోపాలపురంలోనే ఉంటానని అన్నాడు. ఈక్రమంలో అటు భార్య, పిల్లల వద్దకు వెళ్లలేక.. ఇటు సొంతూరిని వీడలేక మనస్తాపం చెంది ఈనెల 4న పురుగుల మందు తాగి తన తల్లి కొమురమ్మకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ప్రాణంతీసిన.. పంచాయతీ ట్రాక్టర్

- ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి



శాన్విక్ (ఫైల్)

కాళేశ్వరం : గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరించే ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా..అజాగ్రత్తగా నడపడంతో ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడిపైకి దూసుకు వెళ్లడంతో తీవ్ర గాయాలై మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దంపేటలో చోటుచేసుకుంది. మహాదేవ్‌పూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దంపేటకు చెందిన జనగామ శ్రావణ్ కుమారుడు శాన్విక్ (2) మంగళవారం ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. అదే సమయంలో గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో డ్రైవింగ్ చేయడంతో బాలుడి పైకి దూసుకు వెళ్లగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి శ్రావణ్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కురుసం రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు.

మొబైల్ వాడొద్దన్నందుకు..

- ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

ఖిలా వరంగల్ : మొబైల్ వాడొద్దని మందలించడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి పెరుకవాడలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ పెరుకవాడకు చెందిన టింగిల్‌కార్ నితీషా (18) ఇంటర్ పూర్తి చేసింది. తరుచుగా సెల్‌ఫోన్ చూస్తుండడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నితీషా సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతురాలి సోదరుడు వికాస్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, the undersigned ABDUL MANAN HASEEB (New Name), previously called ABDUL MANNAN HASEEB (Old Name), and residing at H.No. 23-6-173, Hunter Road, Hanamkonda, Hanumakonda District - 506001, Telangana State, India and solemnly declare.
[SCA25003361]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్
[SCA25003322]

WANTED

■ హన్మకొండలో హాస్టల్ నందు వంట చేయుటకు భార్యభర్తలు కావలెను. ఉచిత వసతి+ భోజనం కల్పించబడును. సంప్ర।। 8074465703, 9849038142.
[WA-14785]

■ Wanted Sr.Accts Exec, Apply before 19th May On https://www.indiaalliance.org/career
[WB-4787]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ।। 260/- అదనపు లైను రూ।। 60/- మాత్రమే 5% GST అదనము

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 20K. ఫోన్ 8977639663, 8977639662.
[SCA25003196]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ పేజీలో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.